క్లుప్తంగా

ఉపాధి హామీ కూలీల నిరసన

కొయ్యలగూడెం: శ్రమకు తగ్గ కూలి లభించడం లేదంటూ ఉపాధి హామీ కూలీలు మంగపతిదేవిపేట గ్రామంలో శుక్రవారం దయం సీపీఐ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ నేతృత్వంలో నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పని చేసినా రూ.100 నుంచి రూ.150 మించి రావడం లేదని పేర్కొన్నారు. పని దినాలు 200 రోజులకు పెంచాలని, రోజుకి రూ.600 గిట్టుబాటు అయ్యేలా చేయాలని నినదించారు. బకాయిలు చెల్లించాలని కోరారు. తేలే దుర్గారావు బి.వెంకాయమ్మ పెన్నాడ ధర్మయ్య, తేలే దుర్గ, ఎం.మాలమ్మ, సీహెచ్ రమణమ్మ, వజ్రమ్మ, బి.బాబి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

జంగారెడ్డిగూడెం: ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ అన్నారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో శుక్రవారం పలువురు వాహనచోదకులతో హెల్మెట్ కొనుగోలు చేయించి ధరింపజేశారు. చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని, జరిమానాలు విధించకుండా ముందుగా పరివర్తన తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నామని ఎస్సై చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా హెల్మెట్ ధరించకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వాహనాల వేలం ఆదాయం రూ.1,51,500

కొయ్యలగూడెం: వివిధ సారా కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలం ద్వారా రూ.1,51,500 ఆదాయం వచ్చిందని ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పోలవరం ఎస్ఈబీ అధికారుల ఆధ్వర్యంలో వేలం ప్రక్రియ నిర్వహించారు. ఐదు మోటార్ సైకిళ్లను వివిధ వ్యక్తులు వేలంపాట ద్వారా దక్కించుకున్నారని, మిగిలిన రెండు వాహనాలకు జిల్లా అధికారుల తదుపరి ఉత్తర్వుల మేరకు వేలం నిర్వహిస్తారని ఎస్సై చెప్పారు.

సకాలంలో వైద్యం అందించాలి

పోలవరం రూరల్: పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఇన్‌ఛార్జ్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.నాగేశ్వరరావు సూచించారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీని ఆయన శుక్రవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న చికిత్స వివరాల రికార్డులు, సిబ్బందిని హాజరును పరిశీలించారు. వైద్యాధికారి సునందకు పలు సూచనలు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంకు చెందిన అయినవల్లి మంజుశ్రీ అన్నమాచార్య కీర్తనలు, భక్తి పాటలకు ఈ నృత్య ప్రదర్శనలు చేశారు. ఉచితంగా ఈ ప్రదర్శనలు ఇస్తున్నట్టు మంజుశ్రీ తెలిపారు.

పీడీ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలికల)లో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ ఎం.రజినికుమారి శుక్రవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం5 గంటలలోపు కేఆర్‌పురం ఐటీడీఏ గురుకులంలో దరఖాస్తును సమర్పించాలన్నారు. డిగ్రీ, ఎంపీఈడీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, మెరిట్ ఆధారంగా డెమో, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారమని తెలిపారు. వివరాలకు కళాశాల కన్వీనర్ ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 94909 57254లో సంప్రదించాలని ఆమె కోరారు.

చికిత్స పొందుతూ ఫొటోగ్రాఫర్ మృతి

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై విజయవాడలో చికిత్స పొందుతూ జంగారెడ్డిగూడెంకు చెందిన ఫొటోగ్రాఫర్ మహాశివబట్టు అనిల్‌కుమార్ (30) శుక్రవారం మృతిచెందారు. అనిల్‌కుమార్ (30) తన స్నేహితుడితో గత నెల 26న ద్విచక్రవాహనంపై వెళుతుండగా, స్థానిక త్రివేణీ సెంటర్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో అనిల్‌కుమార్ రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అనంతరం ఏలూరు, మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అనిల్‌కుమార్‌కు భార్య, ఏడు నెలల పాప ఉంది.

నేడు చేయూత మహిళా మార్ట్ ప్రారంభోత్సవం

చింతలపూడి : స్థానిక ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏపీఎం జ్యోతి శుక్రవారం పేర్కొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మద్దులగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం


ప్రజాసమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై పార్టీ శ్రేణులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


చింతంపల్లిలో టీడీపీ కార్యకర్త పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

ద్వారకాతిరుమల: సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమల మండలం మద్దులగూడెం పంచాయతీలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారు పథకాల ద్వారా పొందిన ప్రయోజనాన్ని వివరించి, బ్రోచర్లను అందజేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకూ వస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పేదల కష్టాలను సీఎం జగనన్న స్వయంగా చూడడం వల్లే పరిష్కారానికి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పథకాల నగదు జమ చేస్తున్నారని వివరించారు. జగనన్న సంక్షేమ పాలనను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్‌బాబు, చెలికాని ప్రవీణ్, పసుపులేటి ఏసుబాబు, లక్కాబత్తుల సిద్ధిరాజు, మానుకొండ ప్రసాద్, బసివిరెడ్డి సూరి రాంబాబు, మోటేపల్లి రమేష్, బసివిరెడ్డి సూరిబాబు, మల్లాది కాశీ, బసివిరెడ్డి వెంకట్రామయ్య, గాజుల గణేష్, గాజుల కృష్ణారావు, పోతన శ్రీను, సొసైటీ చైర్‌పర్సన్‌లు చెలికాని సంజయ్, గుర్రాల లక్ష్మణ్, ఎంపీటీసీలు పల్లపాటి ధర్మారావు, మానుకొండ కన్నయ్య, చెలికాని బుల్లియ్య, యాచమనేని నాగేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మానుకొండ సుబ్బారావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ బాషా, దిర్శిపాం అన్నవరం, మల్లెపూడి నాగమణి, జానీ, ఇమ్మానియేలు తదితరులున్నారు.

ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు

చింతలపూడి: అర్హతున్న ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి మండలం చింతంపల్లి గ్రామంలో సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం 101వ రోజు గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా డ్రెయిన్లు, అంతర్గత సీసీ రహదారులు నిర్మించాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. దీనిపై ఎమ్మెల్యే ఎలీజా స్పందిస్తూ స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకు కార్యక్రమం దోహదం చేస్తోందని చెప్పారు. పేదల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం నవరత్నాల పథకాలను అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు, ఉప సర్పంచ్ కె.నాగేశ్వరరావు, మండల పరిషత్ చీఫ్ విప్ కలకొండ రామారావు, సొసైటీ అధ్యక్షుడు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, చుండూరి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల నాగేశ్వరరావు, ఎం.దిలీప్, తమ్మిశెట్టి శ్రీను, సీహెచ్ జ్ఞానారెడ్డి, యర్రంశెట్టి రామకృష్ణారావు, యడ్ల మోహన్‌రావు, గుత్తా కిషోర్, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీడీఓ మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వితరణ

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ అనిల్‌కుమార్ కోసం ప్రతిభ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.70 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని స్థానిక విరాట్‌స్టూడియో అధినేత విష్ణుకు శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ కె.సరోజారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సత్యనారాయణరెడ్డి, సుభాష్‌రెడ్డి, సిందూషా రెడ్డి, దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళా తపస్వి విశ్వనాథ్‌కు సంతాపం

జంగారెడ్డిగూడెం: కళామతల్లి ముద్దుబిడ్డ దాదాసాహెబ్ అవార్డు గ్రహీత కె.విశ్వనాథ్ మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు సబ్బి కనకారావు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు శుక్రవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి తెలుగు చలనచిత్ర కళా రంగానికే కాక ఎందరో రంగస్థలం కళాకారులకు తీరని లోటని పేర్కొన్నారు. సంతాపం తెలిపిన వారిలో వీరమళ్ల సత్యనారాయణ, ఎల్ఆర్ కృష్ణబాబు, బి.నందకుమార్, టీవీ బ్రహ్మచారి, తిరుపతి రమేష్ బాబు, బొందలపాటి పద్మ, తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, కంకిపాటి ఏసు పాదం, కంకిపాటి బుచ్చిబాబు, వీరమల్ల మధు తదితరులు ఉన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే రైతుల రాస్తారోకో


పొంగుటూరు సమీపంలో హైవే రైతులతో చర్చిస్తున్న సీఐ విజయ్ కుమార్

కొయ్యలగూడెం: నష్టపరిహార చెల్లింపులో న్యాయం చేయలంటూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు శుక్రవారం పొంగుటూరు సమీపంలో హైవే నిర్మాణ పనులకు వచ్చిన సిబ్బందిని అడ్డుకొని మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. దీంతో సీఐ విజయకుమార్, ఎస్సై జీజే విష్ణువర్ధన్‌లు ఆందోళనకారులతో చర్చించి పనులు ప్రారంభించారు. దీంతో తీవ్ర అసంతృప్తి చెందిన రైతులు కలెక్టర్‌ను కలుసుకోనున్నట్టు చెప్పారు. ఎకరాకు ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని, అయితే ఆర్బిట్రేషన్ ద్వారా ధర పెంచే అవకాశం ఉందని నాటి కలెక్టర్ తెలిపారని రైతులు గేలం అప్పారావు, పసుపులేటి మోహన్‌రావు చెప్పారు. ఆర్బిట్రేషన్ వల్ల తమకు మరో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెరుగుతుందనే ఆశతో కలెక్టర్ సమక్షంలో నాడు హైవే నిర్మాణ పనులకు భూములు ఇస్తున్నట్లుగా సంతకాలు చేశామని చెప్పారు. రోడ్డు నిర్మాణం వల్ల క్రాఫ్ డామేజ్‌కు నష్టపరిహారం కల్పించలేదని, సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయలేదని, జలకళ ద్వారా భూనిర్వాసితుల రైతుల మిగులు భూమి పొలాల్లో బోర్లు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకే పనులు అమలవుతున్నాయని రైతులకు నష్టపరిహారం ఇస్తారని తహసీల్దార్ నాగమణి పేర్కొన్నారు. రాస్తారోకోలో గేలం శివప్రసాద్, పసుపులేటి సావిత్రి, ఆకుల వీర్రాజు, పేర్రాజు, తదితరులు పాల్గొన్నారు.


వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపాల్టీ పరిధి సచివాలయాల్లో ఏడు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కమిషనర్ పి.భవానీ ప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. ఓసీ (పురుషుడు)-1, బీసీ-బి (పురుషుడు)-1, బీసీ-బి (మహిళ)-1, బీసీ-డి (పురుషుడు)-1, ఎస్సీ(పురుషుడు)-1, ఎస్సీ (మహిళ)-1, ఎస్టీ-1 పోస్టులకు ఈ నెల 5వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 7న ఇంటర్వ్యూలు, ఎంపిక వివరాలను 9న ప్రకటిస్తామని, వీరికి ఈ నెల 13 నుంచి విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మార్చి నాటికి పన్నుల వసూలు పూర్తిచేయండి

లింగపాలెం: మార్చి నెలాఖరు నాటికి ఇంటి, నీటి పన్నుల వసూలు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకె మల్లికార్జునరావు ఆదేశించారు. గ్రామాల్లోని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై శుక్రవారం స్థానిక లింగపాలెం మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయాల కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. పంచాయతీలు చెత్త నుంచి సంపదతయారీ ద్వారా స్వావలంబన సాధిస్తాయన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. పంచాయతీ చెరువు సాగు భూములు ఆక్రమలకు గురైతే తొలగించాలని ఆదేశించారు. అనంతరం మఠంగూడెంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను డీపీఓ పరిశీలించారు. ఈవోపీఆర్‌డీ జీఎం రత్నకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బౌద్ధారామాలను సందర్శించిన ముంబై విద్యార్థులు


గుంటుపల్లి బౌద్ధారాములను సందర్శిస్తున్న ముంబై విద్యార్థులు

కామవరపుకోట: మహారాష్ట్రలోని ముంబై విశ్వవిద్యాలయంలో పాలీ భాష విభాగానికి చెందిన సుమారు 100 మంది విద్యార్థులు మండలంలోని గుంటుపల్లి బౌద్ధ గుహలను సందర్శించారు. బౌద్ధ ప్రదేశాల సందర్శనలో భాగంగా నాగర్జున కొండ, వట్టిప్రోలు, అమరావతి సందర్శించి గుంటుపల్లి గుహలను సందర్శించినట్లు విశ్వవిద్యాలయ సమన్వయకర్త డాక్టర్ యోజన్ భగత్ తెలిపారు. మూడేళ్లకోసారి వీటితోపాటు ఉత్తర భారత దేశంలోని కొన్ని ప్రాంతాలు, అంతర్జాతీయంగా శ్రీలంక, మయన్మార్, థాయిలాండ్ మొదలైన బౌద్ధ ప్రదేశాలనూ సందర్శిస్తామని చెప్పారు. ఈ ప్రదేశంలోని బౌద్ధరామాలు ఆకట్టుకున్నాయని తెలిపారు

కుష్టు నివారణకు అవగాహన ర్యాలీ


బొర్రంపాలెం పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే పూర్తి స్థాయిలో నయం అవుతుందని బొర్రంపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.ఆంజనేయులు అన్నారు. కుష్టు నివారణ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బొర్రంపాలెం పీహెచ్‌సీ పరిధిలోని రావికంపాడు, నులకానివారిగూడెం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది జి.గిరీష్, షేక్ సుభాని బేగ్, ఉన్నీసా, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవులపల్లిలో..

జంగారెడ్డిగూడెం రూరల్: కుష్టు నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని బొరంపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లిలో కుష్టి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు.

5న ఆత్మజ్ఞాన ధ్యాన శిక్షణ

జంగారెడ్డిగూడెం: ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక శేషాద్రి నగర్ గౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30 వరకు ఆత్మజ్ఞాన ధ్యాన ఒకరోజు శిక్షణ ఏర్పాటుచేశామని ట్రస్ట్ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, కార్యదర్శి తటవర్తి కృష్ణ తెలిపారు. మోడరన్ డే యోగిక్ లైఫ్ స్టైల్ వ్యవస్థాపకుడు ఉండ్రమట్ల హనీష్ ముఖ్యవక్తగా హాజరవుతారని, ధ్యానులు, ఆరోగ్యాభిలాషులు పాల్గొనాలని కోరారు.

బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం

కొయ్యలగూడెం: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని సీఐటీయూ ఆరోపించింది. శుక్రవారం కన్నాపురం చెరువులో పనిచేస్తోన్న ఉపాధి కూలీలను సీఐటీయూ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, ఈ పథకానికి బడ్జెట్లో రూ.30 వేల కోట్లు నిధులు తగ్గించిందని వివరించారు. హోదా ఊసు లేదని, అమరావతికి నిధులు లేవని, పోలవరానికి శూన్యం హస్తాలు చూపించారని ఆరోపించారు. కార్యక్రమంలో కె.మణి, కె.అబ్బులు, జి.అబ్బులు, జి.దాసు, ఎస్.వెంకటేశు, ఎ.రాధ, ఎ.మరియమ్మ, ఎన్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

టి.నరసాపురం: తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు అత్తులూరి సత్యనారాయణలు శుక్రవారం ప్రారంభించారు. 30 మంది మహిళలు మొదటి బ్యాచ్‌లో శిక్షణ తీసుకోనున్నట్లు చెప్పారు. బీజేపీ మండలాధ్యక్షుడు మాలెంపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కుక్కునూరు: కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కునూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితుల ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల అధ్యక్షుడు మైసాక్షి వెంకటాచారి, నాయకులు వరకా శ్యామలా, కణితి రాము, బాబురావు, వర్సా నాగేశ్వరావు, ఇరమయ్య, ఉంగా పాల్గొన్నారు.

స్కూల్ ఫిర్యాదుల బాక్స్‌ల పరిశీలన


ఫిర్యాదుల బాక్స్‌లను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: పాఠశాలల ఫిర్యాదు బాక్సులను శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. మండలంలోని 130 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పిర్యాదు బాక్సులను మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. వాటిని తహసీల్దార్ ఎస్.శారా శాంతి, ఎంపీడీఓ శ్రీహరి, ఎంఈఓ టి.బాబూరావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వెలుగు ఏపీఎం పద్మావతి, తదితరుల సమక్షంలో పరిశీలించి నివేదిక రూపొందించారు. దీనిని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు అందజేస్తామని తహసీల్దార్ శాంతి తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


రాఘవాపురం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఇన్‌చార్జి డీఈఓ

చింతలపూడి: ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యా శాఖ ఇన్‌చార్జి అధికారి ఎంవీ అవధాని 10వ తరగతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పలు పాఠ్యాంశాలపై ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం, నాడు, నేడు పథకంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం పీఎస్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ చోరీ

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. గత నెల 31వ తేదీ రాత్రి రాజీవ్ నగర్‌లోని తన ఇంటి వద్ద పార్క్ చేసిన మోటార్ సైకిల్ కనిపించలేదని బాధితుడు ఎ.అర్జున్ నరసింహనాయుడు శుక్రవారం ఫిర్యాదు చేశాడన్నారు.

కోడిపందేలపై దాడి

కుక్కునూరు: స్థానిక లంకాలపల్లి అటవీప్రాంతంలో కోడిపందేల నిర్వహణపై జీలుగుమిల్లి పోలీసులు శుక్రవారం దాడిచేశారు. భారీగా మోటార్ సైకిల్‌లు, పందెంరాయుళ్లు పట్టుబడినట్టు సమాచారం. గురువారం వేలేరు గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో కూడా కోడిపందాలు నిర్వహించినట్టు తెలిసింది.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు

ద్వారకాతిరుమల: వృద్ధుడు తీవ్రంగా గాయపడడానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై టి.సుధీర్ శుక్రవారం తెలిపారు. తిమ్మాపురానికి చెందిన కొనకళ్ల నాగేశ్వరరావు గురువారం మధ్యాహ్నం టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై శ్రీవారి నిత్యాన్నదాన భవనం వద్దకు వెళుతున్నాడని, కొండపైకి వెళ్లే ఆర్చిగేటు కూడలికి వచ్చేసరికి, గుడి సెంటర్ నుంచి వేగంగా భీమడోలు వైపుకు వెళుతున్న ఆర్టీసీ ఏలూరు డిపో బస్సు మోపెడ్‌ను ఢీకొట్టిందని చెప్పారు. తీవ్ర గాయాలు పాలైన నాగేశ్వరరావు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఆయన మనుమడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర భక్తులు


రాళ్లకుంట మీదుగా కాలినడకన వస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి శుక్రవారం పాదయాత్ర భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన శనివారం చినవెంకన్నను దర్శించేందుకు రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, పాలకొల్లు, నిడమర్రు, కృష్ణా జిల్లాతో పాటు ఏలూరు, ఖమ్మం, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాలకు విచ్చేశారు. వీరికి కొండపైన వకుళమాత నిత్యాన్నదాన భవనంలో స్వామివారి ఉచిత అన్నప్రసాదం అందించారు. వసతి సౌకర్యాం కల్పించారు. శనివారం ఉదయం శ్రీవారి ఉచిత దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

తిరగబడిన లారీ : డ్రైవర్‌కు గాయాలు


పండుగూడెం సమీపంలో తిరగబడిన లారీ

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): షోలాపూర్ నుంచి మల్లకు ద్రాక్ష లోడు రవాణా చేస్తున్న లారీ జీలుగుమిల్లి మండలం పండువారిగూడెం సమీపంలో అదుపు తప్పి తిరగబడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అతనిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఫ్యాక్టరీ అసిస్టెంట్ మేనేజర్‌పై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని పి.కన్నాపురం సర్వారాయ షుగర్స్ లిమిటెడ్ బాటిలింగ్ యూనిట్ (కోకోకోలా ఫ్యాక్టరీ) అసిస్టెంట్ మేనేజర్ (లాజిస్టిక్స్) పద్మనాభుని శివకుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని తనతోటి ఉద్యోగి నరాల శ్రీనివాసుతో కలిసి శివకుమార్ బైక్‌పై భీమడోలులోని తన ఇంటికి వెళుతున్నాడు. స్థానిక వీరాంజనేయ హోటల్ వద్దకు వచ్చేసరికి మాస్కులు, హెల్మెట్‌లు ధరించి ఉన్న గుర్తుతెలియని ఇద్దరు బైక్‌ను అడ్డగించి, శివకుమార్‌పై రాడ్డుతో దాడి చేశారు. శ్రీనివాసు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా బైక్‌పై పరారయ్యారు. ఇటీవల వృత్తి రీత్యా ఇద్దరు వ్యక్తులకు తనకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుందని, ఈ దాడికి వారే కారణమని శివకుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

దేవులపల్లిలో కొట్లాట: పలువురికి గాయాలు


గాయపడిన క్షతగాత్రులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని దేవులపల్లిలో ఇల్లు, స్థల వివాదం కొట్లాటకు దారీ తీసింది. దీంతో జువ్వాల శివకు తలకు తీవ్ర గాయం కాగా, జువ్వాల వెంకటేష్, జువ్వాల చిన్నాలు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు లక్కవరం పోలీసులు తెలిపారు.

